# క్రీస్తులోని దైవత్వమును ఎరుగుటయే క్రైస్తవత్వము

యేసుక్రీ స్తు పిలిప్పుదైన కైసరయ ప్రాంతములకు వచ్చినప్పుడు తన శిష్యులతో మనుష్య కుమారుడెవడని జనులు చెప్పుకొనుచున్నారని అడిగెను. అప్పుడు వారు కొందరు బాప్తిస్మమిచ్చే యోహాననియు కొందరు ఏలియా అనియు కొందరు యిర్మియా లేక ప్రవక్తలలో ఒకడని చెప్పుకొనుచున్నారనిరి. అందుకాయన మీరైతే నేను ఎవడనని చెప్పుకొను చున్నారని, వారినడిగెను. అందుకు సిమోను పేతురు. “నీవు సజీవుడవగు దేవుని కుమారుడవైన క్రీస్తువని" చెప్పను. అప్పుడు యేసుక్రీస్తు నీవు ధన్యుడవు. పరలోకమందున్న నా తండ్రి ఈ సంగతిని బయలు పరిచేసే గాని నరులు నీకు బయలు పరచలేదు అనెను. (మత్తయి. 16:13-17) అనగా తండ్రియైన దేవుడు యేసు క్రీస్తులోని దైవత్వమును పేతురుకు కడమ అపోస్తులకు భయలు పరిచినాడు. మీరైతే నా గురించి ఏమనుకుంటున్నారు అని అపోస్తులందరిని అడిగినాడు. అందుకు పేతురు జవాబు చెప్పాడు అనగా అపోస్తులందరికి బయలు పరిచిన ప్రత్యక్షతయే ఇది. ఇక్కడ యేసుక్రీస్తు గురించి నాలుగు విధములుగా చెప్పుకొనుచున్న నాలుగు గుంపులను మనం చూస్తున్నాము. బాప్తిస్మమిచ్చే యెహాను అనుకుంటున్న గుంపు ఏలియా అనుకుంటున్న మరొక గుంపు, యిర్మియా లేదా ఒక ప్రవక్త అనుకుంటున్న మరొక గుంపు. కాని అపోస్తులకు మాత్రం సజీవుడగు దేవుని కుమారుడైన క్రీస్తు" అని తండ్రి బయలు పరిచినాడు. తండ్రి అపొస్తులకు ప్రత్యక్షపరిచిన ఈ మాటల్లో తండ్రి కుమార పరిశుద్ధాత్మ, (త్రీత్వము) కలిసి ఉన్నాయి.

**సజీవుడు** :- " నేను మొదటివాడను, కడపటివాడను, జీవించువాడను, మృతుడనైతినిగాని ఇదిగో యుగయుగములు సజీవుడనై యున్నాను" (ప్రకటన. 1:18)

**దేవుని కుమారుడు**:- "ఆయన దేవుని స్వరూపము కలిగినవాడై యుండి దేవునితో సమానముగా ఉండుట విడిచి పెట్టకూడని భాగ్యమని యెంచుకొనలేదు. గానీ, (ఫిలిప్పి-2:6) ఏలయనగా మనకు శిశువు పుట్టెను, మనకు కుమారుడు అనుగ్రహించ బడెను, ఆయన బుజముల మీద రాజ్యభారముండును. ఆశ్చర్య కరుడు, ఆలోచన కర్త , బలవంతుడైన దేవుడు, నిత్యుడగు తండ్రి, సమదాన కర్తయగు అధిపతియని అతనికి పేరు పెట్టబడును" (యెషయ 9:6)

" ఆదియందు వాక్యముండెను, వాక్యము దేవుని యొద్ద ఉండెను, వాక్యము దేవుడైయుండెను (యొహాను 1:1)"

"దేవుడు తన స్వరక్తమిచ్చి సంపాదించిన సంఘము " (అపో.కా. 20:18)

**క్రీస్తు** :- క్రీస్తు అనగా అభిషక్తుడు అని అర్థం వచ్చును. "ప్రభువగు యెహోవా ఆత్మ నా మీదికి వచ్చియున్నది. దీనులకు సువర్త మానము ప్రకటించుటకు యెహోవా నన్ను అభిషేకించెను " (యెషయా.61:1)

" అదేదనగా దేవుడు నజరేయుడైన యేసును పరిశుద్ధాత్మతోనూ, శక్తితోనూ అభిషేకించెననునియే. దేవుడాయనకు తోడై యుండెను గనుక ఆయన మేలు జేయుచు, అపవాది చేత పీడింపబడిన వారందరిని స్వస్తపరుచుచు సంచరించుచుండెను. (అపో.కా. 10:38)

యేసుక్రీస్తు సాక్షాత్తు దేవుని స్వభావం కలవాడు మరియు యేసుక్రీస్తు దేవుడు అని ప్రవక్తల మాటలను బట్టి తెలుసుకొనవచ్చును మరియు దేవుడు యేసు క్రీస్తును దీనులుకు సువర్తమానము ప్రకటించుటకు, విడిపించుటకును, మేలు చేయుటకును అభిషేకించెను.

యేసు క్రీస్తు అనేక ప్రాంతాలలో సంచరిస్తున్నప్పుడు వేల మంది జన సమూహములు ఆయన యొద్దకు వచ్చినారు. యేసుక్రీస్తు చెప్పుచున్న మాటలను బట్టి చేస్తున్న అద్భుత కార్యములను బట్టి ప్రజలు క్రీస్తును గురించిన రకరకాలైన అభిప్రాయాలను కలిగియున్నారు. పూర్వకాలములో ప్రవక్తల మాటలను, అద్భుతములను తెలుసుకున్నవారుగాను, చూచిన వారు గాను క్రీస్తును కూడా ఒక ప్రవక్తగానే ఎంచు చున్నారు. ప్రజలు వేల మంది యేసు క్రీస్తు యొద్దకు వస్తున్నను వారు తమకు అనుకూలమగు స్వంత మార్గములను వెంబడించు వారును, స్వచిత్తమును చేయువారు గనుకనే తండ్రి క్రీస్తులో ఉన్న దైవత్వమును వారికి బయలు పరచలేదు. అయితే తండ్రి క్రీస్తులో ఉన్న దైవత్వమును శిష్యులకు మాత్రమే ఎందుకు బయలు పరిచినాడు అనగా వీరు లోకములో ఎన్నిక లేని వారును, లోకమును సంపాదించాలనే మనసు లేని వారైయున్నారు. నన్ను వెంబడించుము అని క్రీస్తు చెప్పిన ఒక్కమాట తోనే వారికున్న సమస్తమును విడిచిపెట్టి క్రీస్తు అడుగుజాడలను అనుసరించిన అమాయకులు క్రీస్తు పిలుపులో ఉన్న సంపూర్ణతను ఎరిగిన సాత్వికులు. కాబట్టి దేవుడు వారిని ఏర్పరచి క్రీస్తులొ ఉన్న దైవత్వమును బయలు పరచి క్రీస్తుకు సాక్షులుగా ఉండుటకు నిర్ణయించినాడు.

అందుకే యేసు క్రీస్తు పేతురుతో నా తండ్రి ఈ సంగతి బయలుపరిచేనె గానీ, ఏ నరుడు నీకు బయలు పరచ లేదని అనెను. పెంతెకొస్తు పండుగ నాడు, యెరుషలేము వీధిలో అపోస్తలందరి మధ్యలో నిలబడి పేతురు ప్రసంగం చేయుచుండగా అది వినిన వారు, అయ్యలారా మేమేమి చేయవలెనని అపోస్తులందరిని అడిగినారు. కానీ పేతురు పరిశుద్ధాత్మ ద్వారా క్రొత్త నిబంధన సంఘము కట్టబడడానికున్న, ఏడు రకాల ఉపదేశములను బయలు పరిచినాడు. అవి 1. మారు మనసు 2. బాప్తిస్మము 3. పరిశుద్ధాత్మ 4. ప్రత్యేకత 5. అపోస్తుల బోధ 6. సహవాసము 7. రొట్టె విరుచుట ప్రార్థన. అనగా వాక్యమును అంగీకరించిన మూడు

వేల మంది సమిష్టిగా అపోస్తులందరిని అడిగినప్పుడు బయలు పరచబడిన ఉపదేశమును అపొస్తులందరి పక్షముగా పేతురు ప్రకటించినాడు. అయితే క్రీస్తు ప్రత్యక్షతనుబట్టి సమస్తమును ఉపేక్షించుకున్న శిష్యులు. ఏకమనస్సు, ఏకాత్మ కలిగినవారై ప్రకటిస్తున్న సువార్తను బట్టి మూడు వేల మంది కూడా ఏక మనసు ఏకాత్మ కలిగినవారై వారికున్న సమస్తమును విడిచి పెట్టినారు.

వాక్యమును ప్రకటించిన మొదటి అపొస్థులు, వాక్యమును అంగీకరించిన మొదటి విశ్వాసులు (శిష్యులు) అందరునూ భూములను, ఇండ్లను వారికున్న సమస్తమును విడిచి పరదేశులుగా, యాత్రికులుగా సువార్తను ప్రకటిస్తూ ప్రయాణం చేసిన వారే.

నేడు భౌతిక విషయాలను ఆశించి యేసును నమ్మిన స్వార్ధపరులు అనేకులు ఉన్నారు. అయితే వీరికి యేసులో ఉన్న జీవము ప్రత్యక్ష పరచబడలేదు. భౌతిక ఆశీర్వాదములను ప్రకటిస్తూ యేసు పేరున సేవచేస్తున్న దురాశపరులు అనేకులు ఉన్నారు. వీరికి క్రీస్తులోని దైవత్వము ప్రత్యక్ష పరచబడ లేదు, వీరు ఎన్నటికినీ క్రైస్తవులు కాలేరు. **క్రైస్తవత్వము ఆశించేది కాదు గాని ఉపేక్షించేదే.**

ఐగుప్తు రాజపదవిని, పరోకుమార్తె కుమారత్వమును, సుఖమును వదిలి దేవుని ప్రజలతో శ్రమ పడుటకు, నిందలు భరించుటకు ఐగుప్తును విడిచి, మిద్యాను అరణ్యములో తిరుగుచున్న మోషేకు హోరేబు కొండ దగ్గర అగ్ని జ్వాలతో మండుచూ కాలిపోని పొదలో నుండి మాట్లాడిన దేవుని ప్రత్యక్షత, పరలోక మహిమను విడిచి దాసునిగా, రిక్తునిగా మారి శ్రమలు సహించిన క్రీస్తు ప్రత్యక్షతయే (హెబ్రీ. 11:24-నిర్గమ. 3:3-6)

సంఘమును హింసిస్తున్న పౌలుతో, దమస్కు మార్గములో నీవు హింసిస్తున్న యేసును అని మాట్లాడినది. శ్రమలు సహించిన క్రీస్తు ప్రత్యక్షతయే. (అపొ.కా 9:5). ఈ ప్రత్యక్షతను బట్టియే పౌలు తనకున్న సమస్తమును పెంటగా ఎంచుకొనినాడు. క్రీస్తు చేత పట్టుబడిన పౌలు ఆక్రీస్తును పట్టుకొనుటకు పరిగెత్తుచూ అనేక శ్రమలు అనుభవించి మనము దేవుని రాజ్యములో ప్రవేశింపవలెననియు "(అపో.కా. 14:22) సంఘమునకు బోధిస్తూ సంఘము అను క్రీస్తు శరీరము కొరకు క్రీస్తు పడిన పాట్లలో కొదువైన వాటిని నా వంతు, నా శరీరమందు సంపూర్ణము చేయుచున్నాను. (కొలస్సి 1:24). అని క్రీస్తు అప్పగించిన సువార్త నిమిత్తమై అనేక శ్రమలను అనుభవిస్తూ సంఘమును కూడా శ్రమలగుండా నడిపించుటకు ప్రయాసపడుచూ, పోరాడుచూ తన పరుగును తుదముట్టించినాడు.

పేతురు కూడా సంఘమునకు వ్రాస్తూ " క్రీస్తు శరీరముందు శ్రమపడెను గనుక మీరును అట్టి మనసును ఆయుధముగా ధరించుకొనుడి (1 పేతురు. 4:1)

" ప్రియులారా మిమ్మును శోధించుటకు మీకు కలుగుచున్న అగ్ని వంటి మహాశ్రమను గూర్చి మీకేదో వింత సంభవించినట్లు ఆశ్చర్యపడకుడి " (1 పేతురు 4:12)

" క్రీస్తు నామము నిమిత్తము మీరు నిందపాలైన ఎడల మహిమా స్వరూపియైన ఆత్మ అనగా దేవుని ఆత్మ మీమీద నిలుచు చున్నాడు గనుక మీరు ధన్యులు (1 పేతురు. 4:14).

“ఎవడైననూ క్రైస్తవుడైనందుకు బాధ అనుభవించిన ఎడల అతడు సిగ్గు పడక ఆ పేరును బట్టియే దేవుని మహిమ పరచవలెను " (1 పేతురు. 4:16).

క్రీస్తు ప్రత్యక్షతను బట్టియే సుఖపడే మనస్సు తొలగిపోయి శ్రమపడే మనస్సు కలుగును. ఈ శ్రమపడే మనసును బట్టియే, లాభకరముగా ఉన్నవి నష్టముగా ఎంచుకొందురు. కలుగుచున్న శోధనలు అగ్నివంటి శ్రమలలో కూడా ఏదో వింత సంభవించినట్టుగా కాకుండా వారి జీవితంలో జరుగుచున్న

ప్రతి పరిస్థితిని ముందే ఎరిగిన వారుగా కలవరపడక విశ్వాసములో స్థిరపడుచూ ఇంకనూ ముందుకు వెళ్ళెదరు. క్రీస్తు ప్రత్యక్షతను బట్టి క్రైస్తవులుగా మారిన వారు. విశ్వాస ప్రయాణములో ఎన్ని బాదలు వచ్చిననూ క్రీస్తును మహిమ పరిచెదరు, సిగ్గుపడక సమస్త ఆటంకములను ఎదురిస్తూ ముందుకు వెళ్లెదరు. **వీరు క్రీస్తును ధరించిన క్రైస్తవులు, వీరు లోకమునకు వెలుగు, వీరే లోకములో క్రీస్తుకు సాక్షులు, క్రీస్తు శ్రమలలో పాలివారు. వీరు దేవుని ఆత్మచేత కట్టబడుచున్న క్రొత్త నిబంధన సంఘము, వీరు ఇక్కడ సుఖముగా బ్రతుకుటకు స్వస్థతను కోరువారు కాదు. గానీ, శరీరమును నలుగగొట్టు శ్రమలను ఎన్నుకున్న వారే, భౌతిక ఆశీర్వాదము కొరకు దేవుని వెతికే వారు కాదు గాని దేవుని నుండి ఆత్మీయ ఆశీర్వాదమును పొందిన వారై సమస్తమును ఉపేక్షించుకున్నవారే. లోక జీవితముకై జీవన వ్యాపారములో చిక్కుకున్నవారు కాదు గానీ నిత్యజీవము చేపట్టుటకు పరుగెత్తుచూ విశ్వాస సంభందమైన పోరాటం పోరాడువారే. వీరి ఎదుట పాతాళ శక్తులు నిలువ లేవు.**

ప్రియ సహోదరుడా! ప్రియ సహోదరి! నీవు యేసును నమ్మిన స్వార్ధపరుడివా! లేక దైవ ప్రత్యక్షత కలిగిన క్రైస్తవుడివా! స్వార్ధ పరుడివైతే నిన్ను నీవు ఉపేక్షించుకొని క్రీస్తులో ఉన్న దైవత్వమును ఎరిగి, శ్రమలగుండా ప్రయాణించి నిత్య జీవములో ప్రవేశించు. ప్రత్యక్షత కలిగిన క్రైస్తవుడివా.. శ్రమలయందు సంతోషిస్తూ శోధనలో ధైర్యం వహిస్తూ ముందుకు సాగిపో.. నీవు గెలుస్తావు. ఎందుకనగా సమస్తమును జయించి సమస్తమునకు పైగా ఉన్న క్రీస్తు నీతో ఉన్నాడు గనుక. దేవుని కృప మీకు తోడై ఉండును గాకా ఆమెన్.

దైవజనులు

S. పూర్ణ భాస్కర్